
ప్రజాశక్తి





జిల్లా అభివృద్ధికి ఊతం ఇచ్చేరా..?

◆ పర్యాటకం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు చేయూత అవసరం

◆ ముఖ్యమంత్రి పర్యటనపై అందరి ఆశలు




అనంతపురంలో ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన

కార్మిక గర్జన..!

◆ జిల్లాలో సార్వత్రిక సమ్మె విజయవంతం

◆ కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసనాగ్రహం

◆ అన్ని మండలాల్లో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు

◆ సమ్మెలో బ్యాంకులు, ఎల్ఐసి, ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు

◆ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై సర్వత్రా ప్రజల కన్నెర్ర

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున నిరసనాగ్రహం వ్యక్తం అయ్యింది. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై జనం కన్నెర్ర చేశారు. కార్మిక చట్టాలను నీరుగారుస్తూ మోడీ ప్రభుత్వం తీసుకొస్తున్న నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె జిల్లాలో పూర్తి స్థాయిలో విజయవంతం అయ్యింది. కార్మిక, రైతుసంఘాల పిలుపు మేరకు చేపట్టిన సమ్మెలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు పలికారు. అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో కార్మికులు రొడ్డెక్కి ప్రదర్శనలు చేయడంతో ఆ ప్రాంతాలు ఎర్రజెండాలతో అరుణారుణమయ్యాయి. నిరసన ప్రదర్శనల్లో కేంద్రం తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని ముక్తకంఠంతో నినదించారు. కార్మిక వ్యతిరేక విధానాలు మార్చకోకపోతే కార్మిక వర్గం ఆగ్రహానికి గురికాక తప్పదని మోడీ ప్రభుత్వాన్ని సార్వత్రిక సమ్మె సాక్షిగా హెచ్చరించారు.

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్మిక సంఘాల ఐక్య జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతంగా ముగిసింది. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియు, బ్యాంక్ ఉద్యోగ సంఘాలు, మున్సిపల్, మెడికల్, గ్రామ పంచాయతీ కార్మికులు, స్కీం వర్కర్‌ల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతపురం నగరంలో ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణకళామందిరం నుంచి టవర్‌క్లాక్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, అంబేద్కర్ విగ్రహం మీదుగా టవర్‌క్లాక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బ్యానర్‌లు, ప్లకార్డులు ప్రదర్శించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, రాజారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వి.రామిరెడ్డి, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియు కార్యదర్శులు ఏసురత్నం, ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఓపిరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. పోరాడి ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకురావడం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. కార్మికుల, శ్రామికుల శ్రమను పెట్టుబడి దారులు, కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. దేశ సంపదను కొల్లగొట్టిన 29 మంది కార్పొరేట్ దొంగల్లో 28 మంది గుజరాత్ నుంచి వచ్చిన వారేనని, వారంతా మోడీకి దత్తపుత్రులేనని విమర్శించారు. మోడీ, అమిత్ షాలు కార్మిక చట్టాలను రద్దు చేసిన దేశద్రోహులని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, కార్మికులు ఏకమై మోడీ అప్రజాస్వామిక విధానాలను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పనిని ప్రవేశపెట్టడం, రాత్రుళ్లు మహిళలు పనిచేయాలని నిర్ణయించడం లాంటి నిర్ణయాలు చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ప్రజలకు కాకుండా కార్పొరేట్‌లకు పాలకుడిగా మారారని ఎద్దేవా చేశారు. సంఘం పెట్టుకునే హక్కు, ఎనిమిది గంటల పని హక్కు, సమ్మె హక్కులను కూటమి ప్రభుత్వం హరించాలని ప్రయత్నిస్తోందని, దీనిని సమిష్టిగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కార్మిక చట్టాలను యథావిధిగా ఉంచి, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. స్కీం వర్కర్‌లందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి, 8 గంటల పని విధానం కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తుజా, శ్రీనివాసులు, తిరుమలేష్, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, సరళ కుమారి, సంధ్య, పద్మ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, చిరంజీవి, భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆదినారాయణ, నాగరాజు, లతీఫ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుమలేష్, లక్ష్మీనారాయణ, ప్రజానాట్యమండలి కళాకారులు శ్రీనివాసులు, మహేష్, పుల్లన్న, నాగేంద్ర, ఆంధ్రప్రదేశ్ మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు అమర్, చంద్రశేఖర్, విశ్వనాథ్, కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాసులు, హనుమంత్ రెడ్డి, ఐఎంఎల్ డిపో నాయకులు తిరుపాల్, మోహన్ రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుతి, నబీరసూల్, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు బాషా, మధుతో పాటు వివిధ కార్మిక, అనుబంధ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



సార్వత్రిక సమ్మెకు మద్దతుగా అనంతపురంలో నిరసన ప్రదర్శన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది


అనంతపురంలో ఎల్ఐసి ఉద్యోగుల సంఘీభావ నిరసన ప్రదర్శన

మరింత వార్త 6లో

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి కేంద్రంగా ఏర్పాటైన సత్యసాయి జిల్లా అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. ప్రభుత్వం చేయూతనందిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం నాడు కొత్తచెరువు పర్యటనలో జిల్లాకు ఏవైనా కొత్త వరాలు కురిపిస్తారా అని జిల్లావాసులు ఆశతో ఎదురు చూస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటై మూడేళ్ళ దాటినా ఇప్పటికీ జిల్లా కార్యాలయాలకు ఎక్కడా సొంతభవనాలు లేవు. చాలీచాలని భవనాలతో అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఏటా రైతులకు నష్టాలే మిగిలుతున్నాయి. పాడి రైతుల పరిస్థితి ఇలానే ఉంది. వ్యవసాయం సన్నగిల్లడంతో గ్రామాల్లో చేసేందుకు పనుల్లేక చాలా మంది పక్క రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. జిల్లాలో కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమ ఉన్నా అందులో జిల్లా యువతకు లభిస్తున్న ఉపాధి నామమాత్రమే అని చెప్పాలి. ఇలాంటి పరిస్థితుల్లో యువతకు ఉపాధిని అందించే పరిశ్రమలు మరిన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సత్యసాయి విమానాశ్రయం అందుబాటులోకి తెస్తే మెరుగైన సౌకర్యాలు వనగూరుతాయి. ఇక్కడికి కేవలం 120 కిలోమీటర్ల దూరంలోనే బెంగళూరు నగరం ఎయిర్‌పోర్ట్ అందుబాటులో ఉన్నాయి. వీటిని దష్టిలో పెట్టుకుని పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తే నిరుద్యోగ సమస్యతో పాటు వలసలను అరికట్టవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు. సత్యసాయి జిల్లాలో పర్యాటక రంగం అభివద్ధి చేయడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయితే గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఆదిశగా చేపట్టిన చర్యలు నామమాత్రమే. లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, కటారుపల్లి, తిమ్మమ్మ మర్రిమాను తదితర ప్రాంతాలను పర్యాటక అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రదేశాలన్నీ కలుపుతూ పర్యాటక అభివృద్ధి చేస్తే ఎంతోమందికి ఉపాధి కూడా కలుగుతుంది. జిల్లాలో 193 చెరువులు కృష్ణా జలాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని గతంలో పాలకులు హామీ ఇచ్చారు. ఈ హామీ నేటికీ పూర్తి స్థాయిలో అమలు జరగలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ చెరువులకు నీరు నింపడంతో పాటు మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లను పూర్తి చేయాల్సి ఉంది. గురువారం నాడు కొత్తచెరువు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధిపై స్పష్టమైన హామీలిచ్చి, నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నేడు కొత్తచెరువుకు ముఖ్యమంత్రి

విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా హాజరు

కొత్తచెరువు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు గురువారం నాడు కొత్తచెరువులో పర్యటించనున్నారు. కొత్తచెరువు జూనియర్ కళాశాల మైదానంలో జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్(ఎంపిటిఎం)లో పాల్గొంటారు. ముఖ్యమంత్రి, మంత్రి రాక నేపథ్యంలో అధికారులు పర్యటన, సభ, తల్లిదండ్రులతో సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ.రత్నలు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కళాశాల మైదానంలో సమావేశానికి స్టేజ్‌ని ఏర్పాటు చేశారు. సమావేశానికి వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులకూ గురవకుండా పార్కింగ్, భోజన వసతి ఏర్పాట్లను చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కొత్తచెరువులో ట్రాఫిక్‌ను మళ్లింపు చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలను అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్ పర్యటన నేపథ్యంలో పుట్టపర్తి, కొత్తచెరువులో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. ముఖ్యమంత్రి భద్రత ఏర్పాట్ల విధులకు వచ్చిన పోలీసు సిబ్బందితో బుధవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి పలు సూచనలు, సలహాలు చేశారు.


నకారా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

ఘనంగా నకారా కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన పెన్షనర్ల పితామహుడు ధరమ్ స్వరూప్ నకారా కాంస్య విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.పెద్దన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప నేతృత్వంలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ జి.ప్రభుదాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కృష్ణ కళామందిరంలో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పొలంకి సుబ్బరాయన్, ఎస్‌జిపిఎ రాష్ట్ర సహాధ్యక్షులు అబ్దుల్ కరీం, డాక్టర్ అక్బర్ సాహెబ్ తదితరులు హాజరై నకారా సేవలను కొనియాడారు. నేడు పెన్షన్ పొందుతున్న ప్రతి పెన్షనర్ నకారా ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, పెన్షనర్ల సంఘం జిల్లా కోశాధికారి రామకృష్ణ, ఆహ్వాన కమిటి నేతలు డి.ప్రభాకర్, సి.అనంతయ్య, కె.సత్యనారాయణ, ఎజి.ప్రమీలమ్మ, కె.ఆదిలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, దివాకర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-అనంతపురం

ఫార్మసీరంగంలో విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉన్నాయని ప్రవాసభారతీయ సాంఖ్యక శాస్త్రవేత్త, డేటా సైంటిస్ట్ డా॥వెంకట్ ఇక్కుర్తి తెలియజేశారు. జెఎన్‌టియుఎ అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ సంచాలకులు జివి.సుబ్బారెడ్డి నేతత్వంలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మాడి విద్యార్థులకు 'ఫార్మసీ రంగంలో ప్రత్యామ్నాయ ఉపాధి, ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన డా॥వెంకట్ ఇక్కుర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఎస్ఎఎస్ ప్రోగ్రాంలో నిష్ణాతులు కావాలంటే ఏ విధమైన సాంఖ్యక శాస్త్ర నేర్చుకోవాలి అనే అంశం మీద విపులంగా వివరించారు. ఈ రంగంలో పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు వారి భవిష్యత్తు ఉపాధి అవకాశాలను విస్తతంగా మెరుగుపరచుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు. దీనిపై విద్యార్థులకు ఆన్లైన్ క్లాసుల ద్వారా సాస్ ప్రోగ్రామ్ గురించి విపులంగా అవగాహన కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓటిపిఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ డా॥సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్ బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


డా॥వెంకట్ ఇక్కుర్తిని సన్మానిస్తున్న జివి.సుబ్బారెడ్డి తదితరులు

ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

జెఎన్‌టియు విసి హెచ్. సుదర్శన రావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు, బ్లెకింగ్ వర్శిటీ(స్వీడన్) సంయుక్త ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జెఎన్‌టియు వైస్‌ఛాన్సలర్ ఆచార్య హెచ్.సుదర్శన రావు తెలియజేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో భాగంగా బీటెక్ మూడు సంవత్సరాలు అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో, ఒక సంవత్సరం విద్యను స్వీడన్ బ్లెకింగ్ యూనివర్సిటీలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీని అనంతపురం జెఎన్‌టియు, బిఎస్ పట్టాను బ్లెకింగ్ వర్శిటీ ప్రదానం చేస్తుందన్నారు. ఎంఎస్(మాస్టర్స్) ప్రోగ్రాంను బిటిహెచ్, స్వీడన్‌లో చేయొచ్చని తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు జెఈఈ, ఈఏపీసెట్ ఆంధ్ర ప్రదేశ్ లేదా తెలంగాణలో అర్హత సాధించి ఉండాలన్నారు. ఈ కోర్సు ద్వారా విదేశాల్లో ఉద్యోగం సంపాదించేందుకు ఇక్కడి విద్యార్థులకు ఇది గొప్ప అవకాశం అన్నారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ కోర్సులో భాగంగా బీటెక్ (కంప్యూటర్ సైన్స్), బీటెక్ (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) కోర్సులను అందిస్తోందన్నారు. అభ్యర్థులు మాస్టర్ కోర్సును మరో రెండు సంవత్సరాల పాటు స్వీడన్‌లో చదువకోవచ్చున్నారు. ఇంటర్మీడియట్ కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. ఇంటర్‌లో 60 శాతం మార్కులు ఉండాలన్నారు. జెఈఈ మెయిన్స్ ర్యాంకు, ఎంసెట్ ఇతర స్టేట్ లెవల్ సెట్స్ ర్యాంకులు పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి స్పాట్ అడ్మిషన్స్ ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. 17వ తేదీ కౌన్సిలింగ్‌ను నిర్వహిస్తామని ఫారిన్ ఎఫైర్స్ డైరెక్టర్ పి. సుజాత తెలియజేశారు.


జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు

నేడు ఎంపిటిఎం సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా 2,511 విద్యాసంస్థల్లో నిర్వహణ - జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పాఠశాలు మరింత అభివృద్ధి పరిచడంలో భాగంగా గురువారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో మెగా పేరెట్ టీచర మీటింగ్(ఎంపిటిఎం)ను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తిఓ మాట్లాడుతూ జిల్లాలో విద్య ప్రమాణాలను మరింత పటిష్ట పరిచే దిశలో కలెక్టర్ వినోద్ కుమార్ నేతత్వంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సున్నితమైన బంధాన్ని పటిష్ట పరుస్తూ మెరుగుపరిచే దిశలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,511 ప్రభుత్వ ప్రభుత్వ ఇతర పాఠశాలలు, మున్సిపాల్టీ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో కార్యక్రమం జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల పరివర్తన, క్రమశిక్షణ, విద్యాభ్యాసం మెరుగైన ఫలితాలు అనేక అంశాలను క్రోడీకరించి విద్యార్థుల సర్వతోముఖభివద్ధికి వేదిక అయ్యేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఇదే కార్యక్రమంలో విద్యార్థుల చేత వారి విద్యాలయం ఆవరణంలో మొక్కటు నాటించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ ఆధ్వర్యంలో భోజనలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని డిఇఒ కోరారు.


డిఇఒ ప్రసాద్‌బాబు

మారని వైసిపి నేతల తీరు : దగ్గుపాటి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డూఅదుపూ లేకుండా నోరుపారేసుకున్న వైసిపిని ప్రజలు ఇంటికి పంపినా వారు మాట్లాడే భాషలో మార్పు రాకపోవడం విచారకరం అని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. బుధవారం ఉదయం నారాయణపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టిడిపి మహిళా ఎమ్మెల్యేపై వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమైనవన్నారు. కక్షలు, గొడవలు వద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సాఫ్ట్‌కార్నర్ వల్లనే వైసిపి నాయకులు రెచ్చిపోతున్నారని, లేకుంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తన ఎలా ఉందో ఆ పార్టీ నాయకుల ప్రవర్తనా అలాగే ఉందన్నారు. మాట్లాడే భాషలో వారి తీరు మారకపోతే ప్రజలతో పాటు తాము గట్టిగా బుద్ధిచెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

కక్కలపల్లి, కాటిగానికాలువలో 'పొలంపిలుస్తోంది'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కక్కలపల్లి, కాటిగాని కాలువ రైతుసేవ కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం నాడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల సాగు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణాధికారిని భాగ్యశ్రీ, గ్రామ ఉద్యాన సహాయకులు దేవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

'ఎవరింటికి ఎవరెళ్తే ఏముంది'..?

◆ అదానీ స్మార్ట్‌మీటర్లు వస్తేనే నష్టం..!

◆ దీనిపై అధికార, ప్రతిపక్ష నేతలు మాట్లాడాలి

◆ సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

'తాడిపత్రిలో అధికార, ప్రతిపక్షానికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలు ఎవరింటికి ఎవరు వెళ్లినా వాటితో ప్రజలకు నష్టం ఏమీ రాదు. కార్పొరేట్ అదానీ స్మార్ట్ మీటర్లు ప్రజల ఇళ్లకు పంపి ఏర్పాటు చేయిస్తున్నారు. ఇది ప్రజలకు అత్యంత నష్టం కలిగించే అంశం. దీనిపై అధికార కూటమి, ప్రతిపక్ష వైసిపి నాయకులు ఆలోచించాలి'. అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలియజేశారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా తాడిపత్రికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. అదానీ కంపెనీ ఇప్పటికే తాడిపత్రి చుట్టుపక్కల ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలను కొనుగోలు చేసిందన్నారు. సోలార్ పవర్ తయారీ పేరుతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని భూములను స్వాధీనం చేసుకుందన్నారు. ఇవేకాకుండా ఇప్పుడు స్మార్ట్ మీటర్‌ల పేరుతో ప్రతి ఇంటికీ బిగించే ఏర్పాటు చేస్తోందన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు జరిగితే ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు పడుతాయన్నారు. తాడిపత్రిలో వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇంటికే వెళ్లి సవాల్ విసరడం, ఇప్పుడు మీ ఇంటికి నేనొస్తా కాసుకో అంటూ జేసి.ప్రభాకర్ రెడ్డి సవాల్ విసరడం చూస్తుంటే వీరికి ప్రజా సమస్యల కంటే వారి సొంత అజెండాలే ముఖ్యమన్నట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు. తాడిపత్రి ప్రాంతంలో ప్రజల సమస్యల పరిష్కారంలో పోటీ పడి మాట్లాడకుండా ఇలా వ్యక్తిగత దూషణలకు వెళ్లడం సరికాదన్నారు. తాడిపత్రి ప్రాంతంలో బీడీ కార్మికులు, గ్రానైట్ పరిశ్రమలు మూత పడి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అరటి చీనీ, దానిమ్మ రైతులు దిగుబడి రాక పెట్టుబటి గిట్టుకోక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలు చేసుకోవడంలో గతంలో ఎమ్మెల్యే చేసింది తప్పే, ప్రస్తుతం ఛైర్మన్ అనుసరిస్తున్న విధానమూ తప్పే అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు ఉండరాదన్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీలు అదానీ స్మార్ట్‌మీటర్లు ప్రజల ఇళ్ల వద్దకు రాకుండా చూడాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్మిక చట్టాల జోలికొస్తే ప్రభుత్వాల పతనమే

సార్వత్రిక సమ్మెలో కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

కార్మిక హక్కుల పరిరక్షణకై కార్మిక సంఘాలు బుధవారం చేపట్టిన సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతమైంది. సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. మానవ హారం ఏర్పడి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు.

నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు అమలు, విశాఖ స్టీల్‌తో పాటు ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ నిలుపుదల, ప్రభుత్వ గనుల కేటాయింపు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, అధిక ధరల నియంత్రణ, పబ్లింగ్ స్కీం వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు ఈఎస్ఐ, హమాలీ, ఆటో, తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రయివేటు విద్యాసంస్థలు, హాస్పిటల్స్, మాల్స్, షోరూమ్స్‌లో పనిచేసే వారికి కార్మిక చట్టాలు, కనీస వేతనాలు అమలు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, కనీస పెన్షన్ రూ. 10,000, అంగన్వాడీ, పంచాయతీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, అంగన్వాడీ వర్కర్లకు తల్లి వందనం అమలు, వివోఏలు, ఎస్ఎస్ఏ, ఉపాధి హామీలో పని చేసే వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరణ, పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు.



తాడిపత్రిలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, కార్మికులు

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్మికుల హక్కులను కాలరాస్తూ, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్ బిల్లులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణంలోని అంగన్వాడీ, ఆశా, సివిల్ సప్లై హమాలీ, సత్యసాయి వాటర్ వర్క్స్ యూనియన్, బీడీ కార్మికులు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అశోక్ పిల్లర్ వద్ద నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కన నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బహిరంగ సభలో ఓబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి కొత్తగా 4 లేబర్ కోడ్ బిల్లులు తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తుందని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను హరిస్తున్నదన్నారు. బిజెపి విధానాలకు ఏపిలో టిడిపి, వైసిపి వత్తాసు పలుకుతున్నాయని ఎద్దేవా చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కార్మికుల నడ్డి విరిచి కార్పొరేట్ శక్తులు లాభపడుతున్నాయని ఆరోపించారు. పాత కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, లేనిచో భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ. 26 వేలు, స్కీం వర్కర్లను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, రమాదేవి, జ్యోతిలత, హనుమంత రెడ్డి, కవిత, కెవిపిఎస్ నాయకులు రామ్మోహన్, అంగన్వాడీ సెక్టార్ నాయకురాళ్లు శంకరమ్మ, గోవిందమ్మ, ఆశా వర్కర్లు లలిత, రాజేశ్వరి, సివిల్ సప్లై హమాలీలు శంకర్, సూరి, వాటర్ సప్లై వర్కర్లు చంద్రశేఖర్‌రెడ్డి, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

ఎల్ఐసి సిబ్బంది సమ్మె సంపూర్ణం

అనంతపురం : ప్రభుత్వ రంగ సంస్థలు, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణం విడనాడాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం అనంతపురం బ్రాంచ్-2 ప్రధాన కార్యదర్శి తాడేపల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెలో ఆయన మాట్లాడుతూ బీమా చట్టాల సవరణ బిల్లును విరమించాలని, బీమా ప్రీమియంలపై భారంగా మారిన 18 శాతం జీఎస్టీని తగ్గించాలని, పని భారం తగ్గించాలని, 3, 4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. సమ్మెకు నాయకులు పి.బ్రహ్మానందరెడ్డి, చెరుకుతోట జగదీష్, టి.నాగేంద్రరెడ్డి, ఎన్ఎఫ్ఐఎఫ్‌డబ్ల్యుఐ నాయకులు భార్గవరెడ్డి, క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.సురేష్, ఎం.వెంకటేశులు, క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల ఆధ్వర్యంలో..

బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని క్లాక్ టవర్ వద్ద ఉన్న కెనరా బ్యాంక్ వద్ద నిరసన తెలిపారు. అలాగే బ్యాంక్ ఉద్యోగులు ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వరకూ వెళ్లి వివిధ కేంద్ర కార్మిక సంఘాలకు మద్దతు తెలిపారు. ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శంకర్ మాట్లాడుతూ బ్యాంకులను ప్రయివేటీకరించరాదని, శాశ్వత నియమకాలు చేపట్టాలని, ఎన్‌పిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను తీసుకురావాలని, అవుట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, 5 రోజుల పని దినాలు అమలు చేయులని, కస్టమర్స్‌కు సర్వీస్ ఛార్జీలు తగ్గించాలని, డిపాజిట్లపై వడ్డీ రేట్లు పెంచాలని, మొండి బకాయిల వసుళ్ల కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ బ్యాంక్ సంఘాల నాయకులు రమణరాజు, శివారెడ్డి, సునీత, మురళి, శ్రీకాంత్, అరవింద్, వహీద్, పవన్, నవీన పాల్గొన్నారు.



గుంతకల్లులో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

సమ్మెకు సంఘీభావంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ర్యాలీ

అనంతపురం : నగరంలో చేపట్టిన సమ్మెకు ఎపిడబ్ల్యుజెఎఫ్ సంఘీభావం తెలిపింది. శ్రీకృష్ణకళా మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫివుల్లా, రేపటి రామాంజినేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని తెలిపారు. ఈ స్థానంలో నాలుగు కోడ్‌లు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. రద్దవుతున్న చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించిన రెండు చట్టాలూ ఉన్నాయని వివరించారు. కార్మిక చట్టాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సుదర్శన్‌రెడ్డి కేశవ్, ఓబుళపతి, దాదు, సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక ప్రధాన సర్కిల్‌లో ఐద్వా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది, పంచాయతీ, సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు, సిఐటియు నాయకులు మానవహారంగా ఏర్పాడ్డారు. సావిత్రమ్మ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శివ శంకర్, రామయ్య, ఆవాజ్ మండల కార్యదర్శి వలి, రైతు మండల కార్యదర్శి జయమ్మ, అంగన్వాడీ సిబ్బంది విజయలక్ష్మి, పుల్లమ్మ, నాగరత్నమ్మ, రాధిక, లక్ష్మీదేవి, సరోజమ్మ, కార్మికులు హరి, ప్రదీప్, శివమ్మ, నాగలక్ష్మి, పోలక్క, రత్నమ్మ, శారద, రామంజనమ్మ, లక్ష్మన్న, కర్రెప్ప, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు, సిపిఎం, సిఐటియు నాయకులు స్థానిక బస్టాండ్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, మండల కార్యదర్శి టి.పెద్దయ్య, రైతు మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, కె.నాగభూషణ్, సిఐటియు మండల కార్యదర్శి ఆర్‌పివి. రాఘవరెడ్డి, జె.పెద్దయ్య, వీటి కుల్లాయప్ప, ఆదినారాయణ, ఎం.శ్రీరాములు, లలిత, శశికళ, రమాదేవి అనంతలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే బికెఎంయు, సిఐటియుసి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, బ్యాంకులను బంద్ చేయించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి డి.పెద్దయ్య, పెద్దిరాజు, ఓబుళపతి, ఓబులేసు, పెద్దయ్య దేవరాజ్, దావీద్, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, శ్రీనివాసులు, కులశేఖర్, నారాయణ, రాజశేఖర్, లక్ష్మన్న, లింగాల ఓబులేసు, ఈశ్వరయ్య, శివ, నవశేఖర, పెద్దన్న, బాలప్ప, చిన్నరంగడు పాల్గొన్నారు.



రాయదుర్గంలో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

రాయదుర్గం : కార్మిక చట్టాల జోలికొస్తే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున హెచ్చరించారు. కార్మిక చట్టాల కుదింపును ఉపసంహరించు కోవాలని, లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోశాధికారి రాధమ్మ, మున్సిపల్ పారిశుధ్య విభాగం నాయకులు రాము, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు మధు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీదేవి, మారెక్క, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమ్మెకు సిపిఎం నాయకులు నాగరాజు, మధు తిమ్మరాజు, అశోక్, నాగ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కోట్రేష్ , కుమార్ నాయక్ తదితరులు మద్దతు తెలిపారు. పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో జరిగిన సార్వత్రిక సమ్మెలో క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగులు పాల్గొన్నారు. విధులను బహిష్కరించి గేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన సమ్మెలో ఎన్ఎంయుఏ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, దామోదర్, సిద్ధేశ్వర్, దూద్‌పీరా, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. స్థానిక రైల్వే క్రీడా మైదానం నుంచి సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు, ఐద్వా, ఆశా, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో రంగం కార్మికులు సిఐటియు జెండాలు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జగదీష్, నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రేష్మా, గంగా, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ప్రమీల, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, కృష్ణా, విద్యుత్ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె ఎం బాషా, ఆటో యూనియన్ నాయకులు హరి, మోహన్, రంజిత్, సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, రాము నాయక్, కమిటీ సభ్యులు తిమ్మప్ప, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు రంగమ్మ, జ్యోతి, డివైఎఫ్ఐ నాయకులు సురేంద్ర బాబు, వంశీ, ఎఐటియుసి నాయకులు ఈశ్వరయ్య, గౌస్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బి.సురేష్ పాల్గొన్నారు.

పామిడి : బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పామిడిలో కార్మిక సంఘాలు సమ్మె బాట పట్టారు. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి ఎద్దులపల్లి రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనిమిరెడ్డి, సిఐటియు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు, పంచాయతీ కార్మికులు, రైతు సంఘం కార్యకర్తలు, సత్యసాయి వాటర్ యూనియన్ సభ్యులు, బస్టాండ్ హమాలీ యూనియన్ సభ్యులు, సిపిఎం, తదితర సంఘాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సిపిఎం నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, రైతు సంఘం నాయకులు ముత్యాలు, నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షాషు, అంగన్వాడీ కార్యకర్తలు జయంతి, నారాయణమ్మ, రామాంజనమ్మ, భారతి, యశోద, పంచాయతీ కార్మికులు నల్లప్ప, రమణ, డ్రైవర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శింగనమల : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారంగా ఏర్పడి మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు.



శింగనమలలో మోకాళ్లపై నిల్చొని నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

భాస్కర్, ప్రాజెక్ట్ లీడర్ రమణమ్మ, భారతి, ప్రమీల మాట్లాడుతూ నగదు బదిలీ పేరుతో రేషన్ బియ్యానికి దూరం చేయవద్దు.. నూతన విద్యా విధానం పేరుతో వీధి బడికి దూరం చేయొద్దు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసి ఏడాదిలో 200 రోజులు పని దినాలు, కనీస సౌకర్యాలు కల్పించాలని, రోజుకు రూ. 600 కూలి, బకాయి బిల్లులు చెల్లించాలని, పనిముట్లు, మెడికల్ బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలన్నారు. వ్యకాసం మండల కార్యదర్శి సుంకన్న, సిఐటియు మండల బాధ్యులు రామాంజనేయులు, అంగన్వాడీ యూనియన్ లీడర్లు రమణమ్మ, రత్నమ్మ, నాగేశ్వరమ్మ, భారతి, ప్రమీల, కాంతమ్మ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కొండారెడ్డి, వెంకట చలిమి, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, మునెప్ప, వెంకట్రాముడు, హమాలీలు గంపయ్య, కుళ్లాయప్ప, రాజు, తిరుపతయ్య, నాగరాజు, శివ, నాగరాజు, నాగేష్, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, అంగన్వాడీలు, హమాలీలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

నార్పల : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికులు, సిఐటియు నాయకులు, పాత్రికేయులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ ర్యాలీలో 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు శ్రీదేవి, రామాంజనమ్మ, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు బాలాజీ నాయక్, ప్రభు, సిపిఎం నాయకులు నడిమిదొడ్డి రామాంజనేయులు, దేవక్క, మహమ్మద్



ఉరవకొండలో సమ్మె సందర్భంగా ప్రసంగిస్తున్న నాయకులు

రఫీ, నడిమిదొడ్డి ప్రభాకర్, సిద్ధారాచర్ల సర్పంచి రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు కేశేపల్లి ఎర్రి నాగప్ప, అంగన్వాడీ సెక్టార్ లీడర్ శ్రీదేవి, సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కణేకల్లు : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక చిక్కణ్ణేశ్వర ఆలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరి నాగరాజు, శర్మాస్, జయశంకర్‌రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు పార్వతి, యశోద, నాగరత్నం, ఆశా వర్కర్స్, సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు, మధ్యాహ్న భోజనం వర్కర్స్ పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : సిఐటియు, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక జడ్పీ హైస్కూల్ నుంచి ర్యాలీగా బయల్దేరి తహశీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా మూడు రోడ్ల కూడలి చేరుకుని మానవహారంగా ఏర్పాడ్డారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సిఐటియు మండల కమిటీ అధ్యక్షులు ఓబులేసు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కుదించడం తగదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్రీనివాసులు, వన్నూరుస్వామి, అంగన్వాడీ జయమ్మ, యూనియన్ నాయకులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మున్సిపల్, హమాలీ యూనియన్లు, ఇతర కార్మికులు ఆర్టీసీ బస్టాండ్ నుంచి వాల్మీకి, గాంధీ సర్కిల్ మీదుగా టీసర్కిల్‌కు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు పాతక్క, వన్నూరమ్మ, దేవి, సావిత్రి, మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి వన్నూరుస్వామి, తిమ్మప్ప, నటరాజు, శివ, సత్యసాయి వాటర్‌సప్లైయ్ నాయకులు వన్నూరప్ప, సివిల్ సప్లైయ్ యూనియన్ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీమ్ వర్కర్స్ జిల్లా కోశాధికారి వన్నూరుస్వామి ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీమ్ వర్కర్స్, సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు స్థానిక బస్టాండ్ నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. తహశీల్దార్ సుమతికి వినతి పత్రం ఇచ్చారు. ఇందులో అంగన్వాడీ వర్కర్స్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు తిప్పురమ్మ, ప్రాజెక్ట్ సెక్టర్ లీడర్లు సత్తెమ్మ, సుజాత, అనిత, హెచ్.సుజాత, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లై స్కీమ్ వర్కర్స్, చిత్తప్ప, హనుమంతరెడ్డి, భీమన్న, గోవిందు, తిప్పేస్వామి పాల్గొన్నారు

కళ్యాణదుర్గం రూరల్ : సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కంబదూరులో చేపట్టిన సమ్మెలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎటిఎం నాగరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నగర కన్వీనర్ చిత్తప్ప, అంగన్వాడీ అధ్యక్షురాలు విజయనిర్మల, మండల అధ్యక్ష, కార్యదర్శులు సువర్ణ, నిర్మల, హమాలీల యూనియన్ నాయకులు విజయ్, గోపాల్, రాజు, అనిల్, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కుందుర్పి : కుందుర్పిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి హోతూరు పరమేష్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ముందుగా అంగన్వాడీ, బిల్డింగ్ వర్కర్స్‌తో కలిసి ర్యాలీ నిర్వహించారు. బ్యాంకు ఎదురుగా కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ నాయకులు సువర్ణ, గంగమ్మ, కవిత, రాధమ్మ, భాగ్య, నరసమ్మ పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : కార్మికుల హక్కులను కాల రాయాలని చూస్తే మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మేరీ హెచ్చరించారు. గుమ్మఘట్టలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు, కార్మికులతో కలిసి స్థానిక ఆర్‌డిటి స్కూల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టి అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.



నార్పలలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

యాడికి : సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్‌లోని ప్రధాన కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బషీర్ అహ్మద్, పట్టణ కార్యదర్శి మోహన్, సిఐటియు నాయకుడు పెద్దన్న, సురేంద్ర, మహాలక్ష్మి, జీనత్ పార్వతి, సిపిఐ నాయకులు జూటూరు బషీర్, వడ్డే రాముడు పాల్గొన్నారు.

ఉరవకొండ : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ వరకూ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వి. నాయుడు, హమాలీ యూనియన్ నాయకులు గోపాల్, వ్యకాసం నాయకులు మురళి, వీరాంజనేయులు, రైతు సంఘం నాయకులు జ్ఞానమూర్తి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, పంచాయతీ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. సార్వత్రిక సమ్మెకు ఎపి కౌలు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, బి. వెంకటేషులు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో సంఘం నాయకులు సుంకన్న, నారాయణస్వామి, శీనప్ప, జయన్న, తదితరులు పాల్గొన్నారు. విడపనకల్లులో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్న రాయుడు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు ర్యాలీగా బస్టాండ్ సర్కిల్ చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు విజయ, అరుణకాంతమ్మ, వనజాక్షి, గాయత్రి, సిపిఐ నాయకులు రఘు, తదితరులు పాల్గొన్నారు. వజ్రకరూరులో సిపిఎం మండల కన్వీనర్ విరూపాక్షి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత బెంజిమెన్, భారత సేవా రత్న జాతీయ అవార్డు గ్రహీత ఎంపి.మల్లికార్జున ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంజి, కసాపురం రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, రాణి, నాగమణి, జానకి, మధ్యాహ్న భోజనం కార్మికులు రంగమ్మ, చాబాల సుధాకర్, హమాలీ కార్మికులు కమలపాడు పెద్దన్న, వెంకటేష్, షేక్షావలి, చంద్రశేఖర్, మా భాష, సత్యసాయి కార్మికులు లాలు స్వామి, ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సిఐటియు, ప్రజా సంఘాలు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పట్టణంలోని ఆర్అండ్ బి అతిథి గృహం నుంచి గాంధీ చౌక్ మీదుగా రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ చేశారు. గాంధీ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, రైతు సంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, నాయకులు రాజేశ్వరి, కవిత, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ ఎన్.రామాంజనేయులు, నాయకుడు ఈశ్వరయ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షులు ఎస్ఏ.మురళి, రాజ్‌కుమార్, కార్యదర్శి రవిశంకర్, సహాయ కార్యదర్శులు నరసింహులు, ఆదినారాయణ, కోశాధికారి నక్కా శేఖర్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కళ్యాణి, శోభ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప : బెళుగుప్పలో సిఐటియు జిల్లా కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అంగన్వాడీ మండల అధ్యక్షురాలు సత్యవతి, సెక్టార్ లీడర్స్ మార్తమ్మ, చంద్రకళ, రామాంజనమ్మ, సుజాత, స్వచ్ఛభారత్ సిబ్బంది బి.చిన్ననారాయణస్వామి, ఎర్రిస్వామి, శ్రీరామిరెడ్డి పథకం కార్మికులు శంకరయ్య, నాగరాజు, మోహన్, పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయ్యింది. నిరసన ర్యాలీలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు తిరుపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి కె.కాత్యాయని, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్.కుళ్లాయప్ప సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నాగలింగమయ్య పాల్గొన్నారు.

రాప్తాడు : సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, పంచాయతీ కార్మికులు, హమాలీలు ర్యాలీ నిర్వహించిన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యకం చేసి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, పోతలయ్య, సిఐటియు నాయకులు పుష్పరాజు, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.



రాప్తాడులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు



సిఐటియు నాయకులపై రెచ్చిపోతున్న డీఎస్పీ రవిబాబు

కార్మికులపై దుర్గం డీఎస్పీ రుబాబు..

కళ్యాణదుర్గం టౌన్ : సమ్మెలో భాగంగా బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన కార్మిక సంఘం నాయకులు, కార్మికులపై డీఎస్పీ రవిబాబు ఆవేశంతో ఊగిపోయారు. టీ సర్కిల్‌లో మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు, వివిధ కార్మిక సంఘాల నాయకులను అడ్డుకుని సమ్మెకు అనుమతి ఉందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె దేశవ్యాప్తంగా జరుగుతోందని కార్మిక సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముందుగానే నోటీసులు జారీ చేశాయని, ఇక ప్రత్యేకంగా అనుమతులు తీసుకోవాలనే సూచనలు ఎక్కడా లేవని సిఐటియు నాయకులు వివరించినా ఆయన వినలేదు. నాయకులు కూడా ససేమిరా అనడంతో కేసుల్లో వుండడానికి, జైలుకు వెళ్లడానికి సిద్ధంగా వుండండంటూ డీఎస్పీ బెదిరింపులకు దిగారు. నినాదాలు చేస్తున్న కార్మికులపై అసహనం వ్యక్తం చేస్తూ ఆపండమ్మా అంటూ అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లపై మండిపడ్డారు. పట్టణ సిఐ యువరాజును పిలిపించుకుని వీరందరినీ కేసుల్లో పెట్టి జైలుకు పంపమని ఆదేశించారు. దీంతో సిఐటియు నాయకులు, డీఎస్పీ, సిఐల మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తతకు దారితీసింది. అరగంటకు పైగా టీ సర్కిల్‌లో డీఎస్పీ చేసిన వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

తల్లికి వందనం డబ్బు అందిందా..? : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఏమేరకు చేరుతున్నాయో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వయంగా లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని 7వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, తదితర పథకాలపై ఆరా తీశారు. సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయన వెంట టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి, నాయకులు శివ, వెంకటేషులు, పురుషోత్తం, హనుమంతు, తిప్పయ్య, మహబూబ్ బాషా, సంపత్ కుమారి ఉన్నారు.



సుపరిపాలన కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ, నాయకులు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

బంగారుపాళ్యం ఘటనపై వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం అయ్యిందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల కష్టాలు తెలుసుకునేందుకు బుధవారం బంగారుపాళ్యం మార్కెట్‌కు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లిన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై అనంత స్పందించారు. రైతుల సమస్యలపై వైఎస్ జగన్‌కు ఉన్న బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కష్టాలు ప్రారంభం అయ్యాయన్నారు. ధాన్యం రైతులు, పొగాకు రైతులు, మిర్చి రైతులు, తాజాగా మామిడి రైతులు గిట్టుబాటు ధరలేక అల్లాడిపోతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో మామిడి రైతులతో మాట్లాడేందుకు వైఎస్ జగన్ బంగారుపాళ్యంకు వెళ్తే వైసిపి కార్యకర్తలు, రైతుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమన్నారు. లాఠీఛార్జ్‌ను ఖండిస్తున్నామన్నారు. పక్కా ప్లాన్‌తోనే ప్రభుత్వం, పోలీసులు జగన్ పర్యటనల్లో వివాదాలు సృష్టిస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ వస్తున్నారని తెలియగానే రైతులు, వైసిపి నాయకులను బెదిరించారని, నోటీసులు జారీ




చేశారని తెలిపారు. సాక్షాత్తూ ఎస్పీ స్థాయిలో ఉన్న వ్యక్తి జగన్‌ను కలిస్తే రౌడీషీట్లు తెరుస్తామంటూ బెదిరించడం చూస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎవరూ ప్రశ్నించకూడదన్న ధోరణిలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా, ఎంత మందిపై కేసులు పెట్టినా ప్రజల పక్షాన వైసిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

రైతుల పక్షాన వైసిపి పోరాటం : మాజీ మంత్రి శైలజనాథ్

చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరామర్శకు వెళ్లిన జగన్‌ను ప్రభుత్వం నిలువరించే ప్రయత్నం చేయడం దారుణమని శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త శైలజనాథ్ మండిపడ్డారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు, వైసిపి కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వం మెడలు వంచి రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతుల పక్షాన వైసిపి పోరాటం చేస్తుందన్నారు.

సింగిల్‌విండో ఛైర్మన్‌గా గుర్రం లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-శింగనమల



మండల సింగిల్‌విండో ఛైర్మన్‌గా గుర్రం లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపి అంబికా లక్ష్మీనారా యణ, ద్వి సభ్య కమిటీ సభ్యులు ఆలం నర్సానాయుడు, ఎడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శింగనమల సింగిల్‌విండో బ్యాంక్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలి

డిఎంహెచ్ఒ ఈబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించాలని డిఎంహెచ్ఒ ఈబి దేవి ఆదేశించారు. ఆమె బుధవారం గార్లదిన్నె పిహెచ్‌సిని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృ అభియాన్ పథకంలో భాగంగా ప్రతి నెలా 9, 10 తేదీల్లో పిహెచ్‌సిలో గర్భిణులకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు ఆదేశాలు, సూచనలు చేశారు. రిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించి సుఖప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెతో పాటు డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్ ఉన్నారు.

15 లోపు పంటల బీమా చెల్లించాలి

ప్రజాశక్తి-నార్పల

ఈ ఖరీఫ్ సీజన్‌లో 13 పంటలకు పంటల బీమా వర్తిస్తుందని, పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ నెల 15వ తేదీ బీమా ప్రీమియం చెల్లించాలని, తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహులు తెలిపారు. మండలంలోని శోధనపల్లి, గంగనపల్లి గ్రామాల్లో బుధవారం ఏవో చిన్నవీరాస్వామి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ కంది, వరి, మొక్కజొన్న, జొన్న, బజ్రా, ఆముదం, ఎర్ర మిరప, పత్తి, వేరుశనగ, దానిమ్మ, చీని, టమోటా, అరటి పంటలకు బీమా ప్రీమియం చెల్లించి, ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పంటలు, వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి ఏవో రైతులకు అవగాహన కల్పించారు. వారి వెంట పంట బీమా కంపెనీ ప్రతినిధులు, గ్రామ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.

పంటల బీమా చేసుకోండి

రాప్తాడు : స్థానిక రైతు సేవా కేంద్రం-1, 2లో బుధశారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కృష్ణచైతన్య రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి దివ్య, ఎఇఒ రంజిత, విహెచ్ఎ సోనియా, విఎఎ శ్రీనివాసులు, ఎంపిఇఒ పద్మ, రైతులు పాల్గొన్నారు.

కట్టకిందపల్లికి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన విద్యార్థుల కోసం బుధవారం గుంతకల్లు ఆర్టీసీ డిపోలో ఎపిఎస్ ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ముందుగా టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పూజలు చేయగా నాగరాజు రిబ్బన్ కట్ చేసి బస్సును ప్రారంభించారు. అదే బస్సులో కట్టకిందపల్లికి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు పెరమసాని రామాంజనేయులు, ఈశ్వరయ్య, పెద్దిరెడ్డి కట్టకిందపల్లి గ్రామస్తులు, విద్యార్థులు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌తో పాటు తనకు వివరించారన్నారు. దీంతో బస్సు సౌకర్యం కల్పించామన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి బస్సు కేటాయించడంపై ఎమ్మెల్యేతో పాటు ఆర్టీసీ ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పూల నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంతకల్లు డిపో మేనేజర్ గంగాధర్, హిమబిందు, నాయకులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న నాగరాజు, నాయకులు

ప్రజాధనం దోచేస్తున్న తెలుగు తమ్ముళ్లు : మాజీ ఎంపీ

ప్రజాశక్తి-కుందుర్పి

తెలుగు తమ్ముళ్లు ప్రజాధనాన్ని దోచుకోవడమే ధ్యేయంగా పని చేస్తున్నారని కళ్యాణదుర్గం నియోజకవర్గ వైసిపి సమన్వకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి మండల కన్వీనర్ హనుమంత రాయుడు వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఆ పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రంగయ్య మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే స్టాంపుల కుంభకోణం మరకను తొలగించుకునేందుకే బీటీపి కాలువ పనులు తెరపైకి తీసుకొచ్చారన్నారు. కళ్యాణి వైన్స్ పేరుతో ప్రజలను నిలువ దోపిడీ చేస్తున్నారన్నారు. గ్రామాల్లో మద్యం ఏరలై పారుతోంద న్నారు. 13 నెలలైనా ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి పూర్తి చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు నిధులు అందించడం చేతకాక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తెచ్చారని మండిపడ్డారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సంచులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అడుగులు వేద్దామని డిస్కవరీ అనంతపూర్ వ్యవస్థాపకులు ఎజి.అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే తొలిసారిగా నగరంలోని రఘువీరా టవర్స్‌లో ఉన్న ఎల్ఎస్ డిజైనర్ స్టూడియోలో చీరల నుంచి తయారు చేసిన సంచులను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బట్ట సంచులతో ప్లాస్టిక్ రహిత సమాజంతో పాటు స్థానిక మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. నగరంలో సుమారు 180 మంది మహిళలు తమ ఇళ్లల్లో తాము ఇచ్చిన చీరల నుంచి ఈ బట్ట సంచులు కుడుతున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా చీరలతో మ్యాచింగ్ అయ్యే సంచులను, ప్రత్యేక డిజైన్లతో కూడిన సంచులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత అనంతకోసం "ఎల్ఎస్ డిజైనర్ స్టూడియో" యాజమాన్యం ముందుకు రావడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ప్లాస్టిక్ సంచులు నిషేధం... ప్రత్యామ్నాయంగా బట్ట సంచులు నినాదంతో ముందుంటామన్నారు. కార్యక్రమంలో "ఎల్ఎస్ డిజైనర్ స్టూడియో" ఎండీ వర్షిత, జ్యోతి, అశ్విని, అనిత, ప్రభ, జ్యోతి పలువురు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రంగయ్య

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పరిశీలన

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును బుధవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరిశీలించారు. ముందుగా సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వపై డిఇ షబానా బేగంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడి ఫిల్టర్ బెడ్లు, నీటి పంపింగ్ మోటార్ల పనితీరును పరిశీలించారు. నీరు శుద్ధి చేయడంలో నిర్లక్ష్యం చేయరాదని, క్లోరినేషన్ సక్రమంగా ఉండాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. నీరు శుద్ధి కేంద్రాన్ని ప్రతి రోజు పరిశీలించాలని అసిస్టెంట్ ఇంజినీర్ సుదర్శన్‌ను ఆదేశించారు. నీరు శుద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

బాలాజీ ఫార్మసీ కళాశాలలో సదస్సు

అనంతపురం : నగరంలోని బాలాజీ ఫార్మసీ కాలేజ్ ప్రాంగణంలో బుధవారం అల్ట్రాసౌండ్ ఆధారిత ఫార్మసీ శాస్త్ర సదస్సు నిర్వహించారు. ప్రముఖ ఎడ్యుకేషనల్ స్పీకర్ డాక్టర్ వెంకట నెర్లపాటి 'అల్ట్రాసౌండ్ గైడెడ్ ఫార్మా స్యూటికల్ ఇంజెక్షన్ క్లినికల్ సైన్స్ అనేది ఫార్మసీలో కొత్త దారితీస్తుంది' అనే అంశంపై వివరించారు. మెడికల్ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, ఫార్మసీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు ఎలా అవలంబించాలో వివరించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పొందడంతో పాటు పరిశోధనాపరమైన ఆలోచనలకు ప్రోత్సాహం లభించిందని తెలిపారు. బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన సాంకేతికతపై అవగాహన కల్పించడానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించిన కళాశాల టీమ్‌కు మెనేజ్‌మెంట్ రిప్రజెంటేటివ్ శ్రీకాంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

టిడిపి నాయకుల సమావేశం

పుట్లూరు : టిడిపి మండల, గ్రామ కమిటీ ఎన్నికల కోసం బుధవారం పుట్లూరు సమీపంలోని నాయకునిపల్లి సుంకులమ్మ దేవస్థానంలో టిడిపి మండల కన్వీనర్ బాల రంగయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పార్టీ మండల పరిశీలకులు వెంకటేశ్వర్లు హాజరై గ్రామ కమిటీ నాయకులతో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూగూడులో ముగిసిన బ్రహ్మోత్సవాలు

చివరిగా దర్శనమిచ్చిన కుళ్లాయిస్వామి

ప్రజాశక్తి-నార్పల



కుళ్లాయిస్వామి చివరి దర్శనం

మండలంలోని గూగూడు గ్రామంలో జూన్ 27వ తేదీ ప్రారంభమైన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ముగిసాయి. కుళ్లాయస్వామి చివరి దర్శనం కోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కొండన్న వంశీయులు కుళ్లాయిస్వామి పీరుని చూపించగానే భక్తులు కుళ్లాయిస్వామి గోవిందా గోవిందా అనే నామస్మరణ మార్మోగింది. అనంతరం కుళ్లాయిస్వామి పీరును పెట్టెలో భద్రపరిచారు. తిరిగి 2026 బ్రహ్మోత్సవాల సమయంలోనే ఈ పీరుని బయటకు తీస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ ఈవో సాకేతపురం శోభ కృతజ్ఞతలు తెలిపారు.

జలధికి తరలిన పీర్లు

పెద్దపప్పూరు : మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం పెద్దపప్పూరులో పీర్లు జలధికి తరలి వెళ్లాయి. ముందుగా పీర్ల స్వాములు అగ్నిగుండం ప్రవేశం చేశాయి. అనంతరం కుళ్లాయిస్వామి పీరును గ్రామమంతా ఊరేగించారు. భక్తులు పీరుకు చక్కెర, బెల్లం చదివించి మొక్కు తీర్చుకున్నారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. అలాగే పసులూరు గ్రామంలో కూడా బుధవారం సాయంత్రం పీర్లు జలధికి తరలివెళ్లాయి.

సిలిండర్ పేలి బంకు దగ్ధం.. ఎమ్మెల్యే ఆర్థికసాయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శెట్టూరు మండలంలోని యాటకల్లు గ్రామంలో మంగళవారం రాత్రి ఓ కిరాణా కొట్టులో సిలిండర్ పేలింది. ఈ సంఘటనలో బంకులో ఉన్న సరుకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అయితే ఆ సమయంలో కిరాణా కొట్టులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితురాలు జంగమ మఠం రత్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో సుమారు రూ. 2 లక్షల వరకూ నష్టపోయినట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు యాటకల్లు గ్రామం వెళ్లి దగ్ధమైన బంకును పరిశీలించారు. బాధితురాలి రూ. 10వేలు అందజేశారు. అలాగే డీఎస్పీ రవిబాబుకు ఫోన్ చేసి ఈ సంఘటనపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి వచ్చే సహాయం అందించాలని ఆర్డీవోకు సూచించారు.

కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుల ఎన్నిక

బొమ్మనహాల్ : మండలంలోని కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులను వారి పరిధిలోని రైతులు ఎన్నుకున్నట్లు ఎస్ఓ నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీధర ఘట్ట సొసైటీ అధ్యక్షుడిగా ఎర్రిస్వామి, మెంబర్లుగా రుద్రముని, మోహన్‌రెడ్డి, ఉద్దేహాల్ సొసైటీ అధ్యక్షుడిగా కొత్తపల్లి మల్లికార్జున, మెంబర్లుగా మృత్యుంజయ, లేపాక్షిని ఎన్నుకున్నట్లు సొసైటీ అధికారి హనుమంతరాయుడు తెలిపారు. వీరి ఎంపికపై రైతులు హర్షం వక్తం చేశారు. సొసైటీ నూతన అధ్యక్షులు, మెంబర్లు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు.

న్యాయవాదుల కోర్టు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి తీర్పుపై టిడిపి సోషల్ మీడియాలో ట్రోల్ చేయడం పట్ల బుధవారం స్థానిక న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లేశప్ప, కార్యదర్శి వన్నూరుస్వామి, న్యాయవాదులు చెన్నవీరప్ప, జగన్మోహన్‌రెడ్డి, లోకానంద, జాన్సన్, శివకుమార్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి పెంపు

అనంతపురం : పుస్తక పఠనం విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచుతుందని శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంచే క్రమంలో భాగంగా బుధవారం నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ లైబ్రరీలో పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థి తీక్షన్‌సాయి వేమనకు సంబంధించిన పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలను లైబ్రరీకి అందించాడు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రిన్సిపల్ తబస్సుంకు పుస్తకాలు అందజేస్తున్న విద్యార్థి తీక్షన్ సాయి